# కారు కథ

సన్నగా దానిమ్మ గింజల్లాటి పలువరుస. దానికితోడు నాజూకైన చిరునవ్వు, ఆపైన చిన్నా తల్వార్ కట్ మీసాలు, అంత గుండ్రం అంత కోలకానిముఖం, చామనచాయ, నొక్కు నొక్కుల క్రాపింగు, కొంచెం యించుమించుగా ఆరడుగుల ఎత్తు... ఏ పెళ్ళికాని అమ్మాయికైనా కలలోకి రావచ్చనిపించే రాకుమారుళ్ళా టిప్‌టాప్‌గా లేతగా నవనవలాడుతున్న పెళ్ళికొడుకులా వుంటాడు బాబు! ఆంధ్ర మహిళాసభ టూరిస్ట్‌హోం కతను శాశ్వత గెస్టు, ఆడబడుచు అర్ధమగడన్నట్లు-ఆ టూరిస్టుహోం కతను చిన్న హోం మంత్రి అన్నా ఫరవాలేదు! బాచిలరే కాని అతడింకా బేచిలర్ ఆఫ్ హార్ట్సు కాలేదు.

"గురూ గురూ మంచి అమ్మాయిని చూడండి. బ్రామిన్స్ అయితే చాలు-నియోగి వైదీకి సబ్ కాస్ట్ ఏవైనా పరవాలేదు. నోడవురీ-గరల్ మస్ట్ బి గుడ్ లుకింగ్... గ్రాడ్యుయేట్ అయితే చాలు" అని కాస్సేపాగి చెయ్‌చూడండి అసలు నాకు పెళ్ళవుతుందంటారా?" అని జాలిగా చూసి "జస్ట్ ఎ మినిట్- ఈ పులివేషం విప్పు లుంగీ కట్టుకుని వొస్తాను" అని రూంలోంచి వెళ్ళిపోయినాడు.

బాబుకి పెళ్ళి ఎందుకు కాదు? పెద్ద అమెరికన్ కంపెనీలో ప్లానింగ్ సెక్షన్లో ఇంజనీరు. మూడువేలుదాకా సంపాదిస్తున్నాడు. స్మార్ట్‌ఫెలో...ఎందు కతనికీవర్రీ...

"లడ్డూలాంటి కుర్రాడివయ్యా ఎవరో ఒకరు ఎగవేసుకుపోతారు-అందాకా తెలివితక్కువగా మాట్లాడకు" అనిభరోసాయిస్తూండేవాళ్ళం నేనూ మా ప్రకాశరావుగారు.

"గురూ గారూ మీకు జ్యోతిషం వచ్చా-న్యూమరాలజీ తెలుసా- జాతకం చూస్తారా?" అని గొడవ పెట్టేవాడు.

"జాతకాలెందుకు? జ్యోతిషాలెందుకు యువారె గుడ్ బోయ్-యు లిల్ గెట్ ఎ గుడ్ మాచ్. మంచి సంబంధం చదువుకున్న చక్కని చుక్కలాంటి పిల్లొస్తుంది" అనేవాళ్ళం.

బాబు ఎంత స్మార్ట్‌గావున్నా, ఎంత జాలీగావున్న అతనిలో ఒక ట్రాజిల్ జీర ఏదో చీకటిగదిలో పెరిగిన ఒంటరిబాలు దిగులుగా వుండేవాడు, చిలిపితనంలో కూడిన జిత్తులమారితనం మాటల్లో ప్రదర్శించేవాడు. ఎవరైనా ఏదన్న సాధిస్తే ఆ విజయం అతనికి తక్కువ సంతోషం కలిగించేది. ఇతరుల పరాజయాలను తల్చుకుని తల్చుకుని చెప్పిపొట్ట చెక్కలయేలా నవ్వించేవాడు?

"గురూగారూ బస్సు దొరకదు. వెళ్ళకండి చాలా ఇబ్బంది పడిపోతారు." అనేవాడు ఎక్కడికైనా బయల్దేరడం తనకిష్టం లేకపోతే

"ఇంత రాత్రిదాకా ఏం రాస్తారు? లైటార్పేస్తాను. బోయ్‌కి చెప్పి పరుపు డాబామీద వేయిస్తాను. పై కెళ్ళి కబుర్లు చెప్పుకుంటూ పడుకుందాం రండి-" అని పారేసేవాడు.

"ఎన్ని సీన్లు రాశారు? పదా...అబ్బో చాలా ఎక్కువ. ఇంక రాయకండి టీ తాగి వాకింగ్‌కి వెళ్ళొద్దాం... ఫ్రెష్ ఎయిర్ -" అని లాక్కుపోయేవాడు.

అతనికి వాళ్ళ డాడీమీద జోక్సు వేయడం అంటే చాలా ఇష్టం కొంచెం అవకాశం వస్తే డాడీని పట్టుకొని తిట్టేవాడు. వాళ్ళ డాడీ ఎవరెవరిని ఎంత పెద్ద జయింట్సుని ఫూల్‌జేశాడో ఆ కథలన్నీ చెప్పి నవ్వించేవాడు. అలా తిట్టితిట్టి "నా పెళ్ళి ఆయన చేయాలని చూస్తున్నాడు. ఏవిల్ నెవ్వర్ ఎలవ్‌హిం- నా పెళ్ళికి పెద్దరికం నెత్తిన వేసుకొని అవతలివాళ్ళను ఫూల్ చెయ్యాలని చూస్తున్నాడు మా డాడీ వట్టి రోగ్- డోంట్‌ట్రస్టుహిం" అని నేనే చెప్పేసి ఆయన మొహం మార్చేస్తాను" అంటుండేవాడు. బజార్లో కొన్న బత్తాయిపళ్ళు తీసుకువెళ్ళి "ఇవి మా బటెనియా గార్డెన్స్‌లోంచి స్పెషల్‌గా తెప్పించినవి అని తన తండ్రి హైద్రాబాద్‌లో ఎందర్ని పల్టీ కొట్టించింది చెప్పేవాడు. బస్సులో నిలబడి "ఫూల్స్-దీస్సీజ్ ది లెటర్ టు మిత్రం ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా "అని డాడీ బిగ్గరగా ఎలా చదివేవాడో యాక్టుచేసి చూపించేవాడు. బర్త్‌డేకి ఫాదర్ రూంకి వచ్చి తలుపు తడితే తలుపు తీయలేదని చెప్పేవాడు డాడీ కిటికీలోంచి స్వీట్లు రూంలోకి పడేసి వెళ్ళేవాడు...వాటిని ముట్టుకోలేదా అంటే అందులో ఏం కలిపాడో బాయస్‌ని పట్టుకెళ్ళి పొమ్మన్నాను అని నవ్వేవాడు.

"ఇలా స్వీట్స్ యిచ్చి వెయ్యో రెండు వేలో యిమ్మంటాడు. హాండ్‌లోన్ మన దగ్గర ఆ పప్పులుడకవు గురూగారూ- హి కాంట్ ఫూల్‌మి" అని పెళ్ళి టాపిక్‌కి దిగేవాడు మంచి అమ్మాయిని చూడండి గురూగారూ...పెళ్ళాడేస్తాను. అని యీగర్‌గా చెప్పేవాడు.

"బాబు నువ్వు ముందు మీ డాడీ గురించి యింత సినికల్‌గా అందరి దగ్గర మాట్లాడటం మానెయ్యాలి. నువ్వు కొంచెం మారాలి. మారకపోతే ఏ అమ్మాయయినా బెదిరిపోతుంది, పెళ్ళాడినా నువ్వు సుఖపడలేవు?"

"అదేంటి గురూగారూ! అలా ఆశీర్వదిస్తున్నారు? వాటీజ్ రాంగ్ విత్ మి...

"నువ్వు తల్లి తండ్రి అక్కచెల్లెళ్ళు అన్నదమ్ముల మధ్య పెరగలేదు. అవునా? ఒంటెత్తుగా పెరిగావు, నిన్ను పెళ్లాడే పిల్ల నీతోపాటు చక్కని కుటుంబంలోకి వచ్చాననుకోవాలి. ప్రపంచమంటే నువ్వు నీ పెళ్ళాం కాదుగా...పడగ్గది సరదా ఎంతసేపు వుంటుంది? తెల్లారేక అందరూ కావాలి అంటుందాపిల్ల. ఎక్కడ్నుంచి తెస్తావు?"

"పాయింటే మరి నేనిప్పుడేం చెయ్యాలి?"

"సినికల్‌గా టేజింగ్‌గా వుండటం మానెయ్యాలి. మీ డాడీ రోగ్ కావచ్చు. కాని నువ్వా ప్రచారం చేస్తేనీకు చాలా ఇబ్బందు లొస్తాయి. ఆయన్ని పక్కన పెట్టాలంటే... ఆ పని మీ వాళ్ళు చేస్తారు."

"అవును, నా పెళ్ళికి మా అమ్మమ్మ మేనమావల కన్వెంటు ప్రధానం-మా డాడీకి అందులో ఛాన్స్ యివ్వకూడదు."

మళ్ళీనువ్వు మాట్లాడతావ్-అమ్మమ్మలు మేనమావల దగ్గర పెరిగిన కుర్రవాడివి. నీ గురించి మీ నాన్న ఎందుకు స్వయంగా కలగచేసుకుంటాడు? అతనికి అవకాశం యివ్వటం, ఇవ్వకపోవటం మీ మేనమామలు అత్త వాళ్ళే చూసుకుంటారు. నువ్వెందుకు మాట్లాడటం?

ఐనా మా డాడీ తెచ్చిన మాచ్ నే ఛస్తే చేసుకోను. బాబు యిలా మాట్లాడేవాడు తల తోకా లేకుండా ఒకరోజున ఓ చిన్న పెగ్గిచ్చి మా ప్రకాశరావుగారు అసలు కారణం రాబట్టాడు.

గురూగారూ అసలు కారణం యిది. ఈ అబ్బాయిని సిజిరియన్ ఆపరేషన్ చేసి తీశారు. తల్లి పుట్టగానే బిడ్డను చూసుకోకుండా పోయింది. అమ్మమ్మ పురిటి గదిలోనుంచి పెంచింది. తండ్రి సెకండ్ లైఫ్ ఆ సంసారం గొడవల్లో యీ కుర్రాడ్ని పట్టించుకోలేదు. పెత్తల్లి పిల్లాడ్ని చంపేస్తుందేమో ఏ మందో మాకో పెట్టి అన్నంత భయంతో పెంచారు. ఇప్పటికే ఆ అబ్బాయి తండ్రిచేత్తో ఏం పెట్టినా తినడు. తండ్రి పొడగిట్టదు అని చెప్పాడు మా ప్రకాశంగారు.

"మనం బాబుకి మంచిసంబంధం చూడాలి. అత్తారింట్లో అతనికి ఆపేక్ష అభిమానం ఆదరణ ముఖ్యంగా లాలన దొరకాలి. ఈ అబ్బాయి వెళ్ళి మంచి కుటుంబంలో పడాలి. అప్పటికిగాని సరవదు. లేకపోతే యితన్ని పెళ్ళాడే పిల్ల భయపడి పారిపోతుంది. అని మే తీర్మానించుకుని ఎరికలో ఎవరైనా మనవాళ్ళపిల్ల వుందా అని ఆలోచించటం ప్రారంభించాం. అతని బయోడేటా వగైరా టైపుచేయించి రాస్తున్న సినిమా స్క్రిప్టులో గుర్తుగా ఎదురుగుండా పెట్టుకున్నాం.

అందర్నీ వేళాకోళాలు చేసి నవ్వే బాబు బిక్కమొహం పెట్టుకుని వచ్చాడో నాడు.

ఏమిటంటే కారు తగులో పడ్డా నన్నాడు. కారు తగూ ఏంటన్నాము. చెప్పండి సార్ న్యాయం అంటూ కారు కథ చెప్పాడు.

బాబు పనిచేసే అమెరికన్ కంపెనీలో గణేశన్ అని బాబు కొలీగ్ ఒకతను వున్నాడట- ఆ కంపెనీలో చీఫ్ ఇంజనీర్లు ఒకే రాంకు రకరకాల డిజిగ్నేషన్‌ల వాళ్ళు ఓ అరడజను మంది దాకా వున్నారట-సెకండ్ సాటర్ డేలు లీవుకని ప్రతి సాటర్‌డే హాఫ్‌డే-ఆరోజు అంతా కలిసి ఏ ఉడ్‌లాండ్స్‌కో కన్నెమెరాకో మెరీనాకోపోయి హోటల్సులో పార్టీ చేసుకునేవారట అందరిలోకి అవివాహితుడు చిన్నవాడు పిల్లాజెల్లా పెళ్ళాం పీచూ లేకుండా ఉన్నవాడు బాదరబందీలు లేనివాడు పూలచెండు కాదు గదా జాకెట్‌పీసుకూడా నయాపైసా కర్చులేనివాడు బాబొక్కడే- బాబుని చూసి చాలా అసూయపడేవారట. ఆ గణేశన్ మలయాళీ. కొత్తగా పెళ్ళయింది. పెళ్ళాన్ని తీసుకుని సాటర్‌డే పార్టీకొచ్చి చిత్తుగా తాగేసి టాక్సీలో "హు ఈజ్ సిటింగ్ బై మైసైడ్" అని పెళ్ళాం జాకెట్టు పట్టుకుని పర్‌మని చించేశాడట పదిమందిలో, ఆ పిల్ల ఈడ్చి లెంపకాయ కొట్టిందిట. కొట్టగా... మర్నాడు ఆ అమ్మాయి షి యీజె ఎమ్మే లిట్రేచర్. మలబార్లో పెద్ద కంట్రాక్టరు ఓన్లీ డాటర్. చెప్పకుండా ఫస్టుక్లాసు టికెట్ కొనుక్కుని ఫస్టుక్లాసులో బల్లనకోడ్ చెక్కేసిందిట-గణేశన్ ఏంటి భాయి-నేనేం చేశాను. నాతో ఎందుకంత రుస రుస లాడ్డం- అసలావిడెందుకు చెక్కేసింది పుట్టింటికి అని గోల పెట్టాడట బాబుతో . తరవాత ఒక కారు కొనమని భాయ్, కారు కొంటేనేగాని అది మళ్ళీ కాపరానికి రాదు. కారు కొనాలి-కొంటే తప్పకుండా వస్తుంది. అని బాబుతో అన్నాడట. వాడే మళ్ళీ కారు కొనాలంటే డబ్బు కావాలి. ఓ టెన్ సర్దగలవా- సెకండ్ హాండ్దైనా యింజనుంటే చాలు అని గోలపెట్టాడట. బాబుకి చిలిపితనం ఎక్కువ కదా, రోజూ ఆఫీసయాక సెకండ్ హాండ్ కార్ల గురించే వాకబులు చెయ్యటం, చూసి రావటం, ఆ మోడల్సు గురించి కబుర్లు చెప్పుకోవడం బ్రోకర్లను పూరించటం ప్రారంభించారట-కొన్నాళ్ళు సరదాగా కార్లగురించి చర్చించగా గణేశన్‌కి పెళ్ళాన్ని తెచ్చుకోడానికి కారు అవసరమేగాని పెళ్ళాం లేకపోయినా బాబుకి కూడా ఒక కారుంటే మంచిదనే భావం ఏర్పడింది. బస్సుల్లో టాక్సీల్లో వెళ్ళడంకంటె ఏపాత స్టాండర్డు టెన్నో, మారిస్ మైనరో (ఇంజన్ మాత్రం మంచిదై తేచాలు) హెరాల్డో. 1958 అంబాసిడరో ఏదో ఒకటి కారుంటే చాలు అనిపించేది బాబుకి?

అవును బ్రదర్ డబ్బంతా ఏంచేస్తున్నావ్ అన్నాడు గణేశన్ అసూయగ.

షేర్ మార్కెట్‌లో పెడుతున్నాను. కొనడం అమ్మడం తల్చుకుంటే లాభాల్తోనే కొనగల్ను కారు. కాని మా అమ్మమ్మ ఈ వెధవకి అప్పుడే పొగరెక్కింటుంది. జడుస్తున్నాను అన్నాడు.

అమ్మమ్మల్నడిగి కొంటారారా కారు. పదభాయ్ నిన్న మనం చూసిన స్టాండర్డు టెన్

1948 మోడల్ ఎప్పటిదయితే ఇంజన్ మా గట్టిది. డోర్సు సీట్లు మార్పించాలనుకో- కలర్ మార్పించాలి- అని ఎగసన తోశాడు.

వాడెంతన్నాడు బ్రోకర్-సెవెనా?

సెవెనే ఐదు కడుగుదాం పద-

ఇద్దరు వెళ్ళారు. వెళ్ళేటప్పుడు ఎవరు తీసుకోవాలో నిర్ణయించలేదు. బ్రోకర్ సేట్‌జీ దగ్గరకు లాక్కెళ్ళాడు. గణేశన్ "నువ్వడుగు భాయ్" అన్నాడు బాబు. "ఫైవ్" అన్నాడు చక్కగా. సేట్‌జీ మార్ డాలా అని "అచ్చాకారు" అన్నాడు. గణేశన్ నేకొన్నా నువ్వే అప్పుపెట్టాలి గదా- చెక్కురాయి అన్నాడు. బాబు చెక్కుబుక్కు రూంలోవుంది అన్నాడు సందిగ్ధంగా. ఆ కార్లో ట్రయల్ ట్రిప్పుని గణేశన్ బాబు చల్ డ్రయివ్ చేయించి రూంకి తీసుకొచ్చాడు. బాబు ఐదు వేలకి సేట్‌జీ పేర చెక్కురాసి గణేశన్ కిచ్చాడు. గణేగన్ కారు నడుపుకుంటూ వెళ్ళి సేట్‌కి చెక్కిచ్చి అక్కడ్నుంచే టూరిస్టు హోంకి బాబుకి రింగ్ చేశాడు. ఏమని? కారుని చిన్న చిన్న రిపైర్సు సీట్లు మార్చడం, అడ్జస్టుమెంట్లున్నాయ్ గారేజ్‌లో యిస్తానన్నాడు. బాబు అలాగే నన్నాడు. పేపర్స్ సేల్‌కి సంబంధించినవన్నీ తన దగ్గరున్నాయన్నాడు. ఓ. కె అన్నాడు బాబు.

ఇంతవరకు కథ చెప్పిన బాబు..."ఆ కారుని నేనిప్పటి వరకూ చూళ్లేదు. పద్దెనిమిది రోజులయింది. ఒక్క రోజు ఎక్కలేదు-" అన్నాడు మనల్ని సస్పెన్సులోపెట్టి.

"బాబు, పెళ్ళిమాత్రం నువ్విలా చేసుకోకు" అని వీపుమీదో దెబ్బవేసి దానిమీదో జోక్ వేశాడు. మా ప్రకాశరావు వర్క్ చెడకూడదని చిన్న చిన్న రవుండ్లు వేసి " సోడాలు కొట్టుబాబూ" అనగానే బాబూలేచి సోడాలు కొట్టి పంపడం ప్రారంభించాడు.

"చీర్స్ టుది కార్‌స్టోరి" అన్నాడు ప్రకాశరావు.

"కారుకథ" విన్నావురా-మిత్రమా

"నిజం గురూగారూ మీరీకథ వ్రాయాలి. రాసి నాకో కాఫీ పంపాలి. నాకు పెళ్ళయ్యాక ఐ విల్ మేక్ హర్ రీడ్ దిస్-" అని మళ్ళీ బ్రహ్మచారి కదా పెళ్ళివైపు లాగాడు.

మేం జరిగిన కథమీద కామెంట్స్ ప్రారంభించాం-

"గురూ వాడెవడో నిన్ను బోల్తాకొట్టించాడు. నీచేత కారు కొనిపించిన వాడు వాడి పెళ్ళాం ఎక్కి తిరిగి మజా సేసుంటారు. ఐ హావ్ మేడే యు ఏ ఫూర్. తెలుగువాడివి కదా అమాయకుడివి. వాడు మళయాళీబుర్ర- నీమీద మాత్రం ప్రయోగించాడు. ఆఫ్టరాల్ ఫైవ్ థవుజండ్ కదా అనొచ్చు నువ్వు. ఫైవ్ రుపీసయితే మాత్రం ఒకడు మన్నేందుకు ఫూల్ చెయ్యాలి! సారీ మైబోయ్" అన్నాం గ్లాసులు చప్పరిస్తూ. బాబు గ్లాసుని పైకెత్తి టోస్ చెబుతున్న వాడిలా "గురూగారూ ఇవ్వాళ ఆ కారున్నేను అమ్మేశాను. ఐ గాట్ ది మనీ నెక్. ఇటీజ్ ఇన్ మైయస్ బి" అన్నాడు నవ్వుతూ బిగ్గరగా.

"కారు నీ దగ్గరలేదు కాగితాలు నీ దగ్గరలేవు. ఎలా అమ్మేశావు కుర్రాడా?" అని మా ప్రకాశరావు ఆశ్చర్యబోతూ అడిగాడు.

"అదేనండీ కథ. అందుకే కథ రాసుకోమంటున్నాను గురూగార్ని. మరో చిన్న రవుండెయ్యండి చాలు. నా గదిలో నువ్వులపొడుం, తూర్రావకాయుంది తెమ్మంటారా ప్రకాశరావుగారూ" అన్నాడు బాబు.

"ఏమిటో అనుకున్నాం బాబు తెలివైనవాడే- మన్ని సస్పెన్సులో పెట్టి చంపుతున్నాడు" అన్నా.

బాబు బెల్లపావకాయ తెచ్చి తలో ముక్క యిచ్చాడు.

"కొంచెం సిప్ చేయండి. ఆ ఇప్పుడు నంజుకోండి. ఎలా వుంది?"

"సుపర్బ్ కథ చెప్పు"

బాబు మళ్ళీ ప్రారంభించాడు తన సహజమిస్చివస్ ధోరణీలో-

"ఆకారు కొన్న రాత్రి వాడు తిన్నగా వెళ్ళి మా బాస్ చెవి కొరికాడు. ఆ మర్నాడు నేను ఆఫీసుకెళ్ళగానే మా బాస్ పిలిచి నన్ను ట్రయినింగ్‌కి ఆరు నెలలు న్యూఢిల్లీ పంపుతున్నట్లు చెప్పాడు. నిజానికి గణేష్ గాడు వెళ్ళాలి. వాడి తరువాతగాని నాకు టరన్ రాదు. నన్నే ముందు పంపించమని వాడు పెళ్ళాన్ని తెచ్చుకుని నా కారులో జల్సా చేయడానికి ఈ ఎత్తుఎత్తాడు. నేను ముక్కీసుగాన్ని. వెళ్ళనని చెప్పటానికి వీల్లేదు. సరేనని ఇవతలికొచ్చి నేనే మర్నాడు ఫ్లయిన్‌కి టిక్కెట్లు బుక్‌చేయమని స్టెనోకి చెప్పి- గణేష్‌గాడితో కారుని నీ దగ్గరే వుంచు అని అనాల్సి వొచ్చింది. గణేష్‌గాడు మీనంబాకందాకా వచ్చి టాక్సీలో దిగబెట్టాడు. లైకెపూల్ ఐ వెంట్ ఢిల్లీ-!

"ఆ తర్వాత"

"ఆర్నెల్లు పోయాక నేను వచ్చినా నా కారు నా దగ్గరకు రాలేదు. నేను ఏం జరుగుతుందో చూద్దామని పూరుకున్నా, గణేషన్ నాకు గారేజివాళ్ళ కారు రిపేరింగుకి సీట్లు వగైరా మార్పులకు చేసిన బిల్లు పద్దెనిమిదివందలు తెచ్చి నా కిచ్చాడు. యూదోమీయే చెక్ ఫర్ యైటీన్ హండ్రడ్ అన్నాడు నేనేం మాట్లాడలేదు నా భార్య ప్రెగ్నెంటన్నాడు. చాలా సంతోషం అన్నాను. ఇప్పుడు కారు లేకపోతే ఇబ్బంది...చాలా అవస్థ పడుతుంది అన్నాడు అయ్యో పాపం అన్నాను. కారంటే యిచ్చావేకాని ఖర్చులు చాలా అయిపోయాయి. బ్రదర్. ఈ గారేజి బిల్లు నువ్విస్తే వెషల్ బి వెరీ హాపీ నీ మేలు మర్చిపోలేను అన్నాడు. మా ఆవిడ చాలా ఖర్చుమనిషి, దాని షోకులకి, జల్సాలకే చాలా అయింది. నేను అప్పుల్లో మునిగిపోయాను. చెక్‌ను త్వరగా యివ్వాలి అంటూ ఊదరగొట్టాడు.

"అప్పుడేం చేశావ్?"

"ఆలోచించాను. వీడు కారు నా చేత కొనిపించాడు. పెళ్ళాన్నేసుకుని సొంతబండిలా

తిరిగాడు. కారు రిపేరీ ఖర్చులు నన్నిమ్మంటున్నాడు. ఇస్తేనేకాని నా బండిని తీసుకొచ్చి నాకు అప్పగించడని అర్థం ఏం తెలివి? గడుసుతనం మడతపేచీ అంటే నీదేరా అనుకున్నాను. ఈలోగా వాడిది ఫ్యాక్టరీ నాది ప్లానింగు సెక్షను-ఇద్దరం వేరయ్యాం నాకు 1800 చెక్కు కోసం ఫోన్ చెయ్యడం ప్రారంభించాడు. కారు అప్పగించటం గురించి ఏమీ మాట్లాడకుండా నేను ఊ-ఆ-చూస్తా-మర్చిపోయా-సారీ అంటూ గడిపేయసాగాను. ఇక ప్రాణం విసిగి వాడే ఓ సాటర్‌డే నా రూము కొచ్చాడు చెక్కు యిమ్మని. కారు నువ్వే ఉంచేసుకో అన్నాన్నేను ప్రాణం విసిగి. గతుక్కుమన్నాడు. ఐకాంట్ ఎఫోర్టెట్ అన్నాడు. వాళ్ళావిడకి పురుడొస్తుందన్నాడు, పెళ్ళాంవల్లన అప్పులయి పోయాయన్నాడు. నేను ఒప్పుకుంటే ఆ కారమ్మేసి ఐదువేలూ తనే తీసుకుంటానన్నాడు. అవురా అని అనుకుని అలాగే అని తలూపాను."

"మళ్ళీ బుట్టలో వేశాడు. గురుడ్ని. పద్దెనిమిది వందలు యివ్వకపోతే ఐదువేలు అప్పుగా లాగాలనుకున్నాడు మీ మళయాలీ ఫ్రండ్ ఇప్పుడేనా చప్పున పెళ్ళి చేసుకో. నీ పెళ్ళావే నీకు సరైన సలహాలు చెబుతుంది" అన్నాడు మా ప్రకాశరావు.

"అందుకే కదా గురువుగారూ! మీరంతా కలిసి ఓ పిల్లని తెచ్చి నాకు పెళ్ళి చేసెయ్యండి మొర్రో అని అడుగుతున్నది" అని గ్లాసు ఖాళీ చేశాడు.

"చెప్పు గురూ నీ కారుకథ యమ సస్పెన్స్‌గా వుంది" అన్నా.

బాబు నవ్వి మళ్ళీ ప్రారంభించాడు.

"గణేశన్ పద్దెనిమిదివందల పాట మానేసి అయిదువేల పాట ప్రారంభించాడు. నేను సరే ఇస్తాన్రా బ్రదర్ అన్నాను. కారు మంచి బేరంచూసి కొన్న ధరకే అమ్మెయ్యమన్నాను.

ఏడువేలకి బేరం వచ్చింది. ఒక మార్వాడీ కారు చూసుకుని

"ఫార్మాలిటీస్ పూర్తిచేస్తే ఇప్పుడే డబ్బిచ్చేస్తానంటున్నాడు" అని గణేశన్ త్వరపెట్టాడు నన్ను రమ్మనమని ఈవేళ శుక్రవారం, మనం అమ్మినా వాడు రేపేడబ్బిస్తాడు అన్నా గణేశన్ తను ఎలాగో ఏర్పాటు చేస్తాను నువ్వు కాగితాలమీద సంతకాలు పెట్టు నేను కాగితాలు పట్టుకొస్తాను అన్నాడు. ఇంత చిన్న పనికి నువ్వెందుకు నేనే వెళ్ళి వాడికా కాగితాలుయిచ్చి ఇవ్వాళ శుక్రవారం గనక రేపు డబ్బు తెచ్చి యిమ్మని చెబుతాను ఆఫీసులో నువ్వక్కడే వుండు అన్నాను. ఆల్‌రైట్ బ్రదర్ అన్నాడు గణేశన్. నేను ఆ కాగితాలు తీసుకుని టాక్సీలో ఆ మార్వాడీ దగ్గరకు వెళ్ళి పన్లు పూర్తిచేసి గణేశన్‌కు కారు అప్పగించమని చెప్పాను. గణేశన్ కారు మార్వాడీ పంపిన డ్రైవరుకి అప్పగించాడు. అయితే నేనో చిన్న ట్రిక్కు చేశాను. మార్వాడీకి నా అక్కవుంటు నంబరిచ్చి ఏడువేలు దాంట్లోకి ట్రాన్స్‌ఫర్ చెయ్యమని చెప్పాను. మార్వాడీ బ్యాంకుకి ఫోన్‌చేసి "అచ్చా సాబ్

అప్ కా కామ్ హోగయా- షుక్రియ" అని చేతులు పట్టుకుని వూపాడు అక్కడ్నుంచి నేను మా అమ్మమ్మగారింటికెళ్ళి డిన్నర్ చేసి రాత్రి ఆలస్యంగా రూంకొచ్చి పడుకుని, ఒంట్లో బాగోలేదని ఫోన్లో క్యాజుయల్లీవు చెప్పాను. గణేశన్ కంగారుగా "ఆఫీసుకు రాలేదేం బ్రదర్" అంటూ వచ్చి మార్వాడీ డబ్బిచ్చాడా, చెక్కిచ్చాడా అంటూ వచ్చాడు. ఈవాళ సెకండ్ సాటర్డే కదా- నిన్ననే నా అక్కవుంట్ నంబరిచ్చాను ఫోన్‌చేసి, అందులోకి ఏడువేలూ మార్వాడీయే ట్రాన్స్‌ఫర్ చేయించాడు. ఎస్. బి లో ఎందుకని ఫిక్సెడ్ డిపాజిట్లో వేయించాను అన్నాన్నేను. గణేశన్ ముఖాన కత్తివేటుకి నెత్తురులేదు నేను మార్వాడీ కలిసి తన్ను చీట్ చేశామని, ద్రోహులమని తిట్టి చక్కాపోయాడు. పోయి రిజిష్టర్డ్ లెటర్ కొట్టాడు. మళ్ళీ 1800 గారేజి బిల్లుకి తను చెల్లించిన సొమ్ముని యిమ్మని- ఇప్పుడేం చెయ్యాలి గురువుగారూ అంటూ నవ్వాడు మిష్టర్ బాబు.

"అతను నీకు ఉత్తరాలు రాసి రాసి మ్యాన్ ఆఫ్ లెటర్స్ అవుతాడు నువ్వేం జవాబివ్వకు" అన్నాం మేమిద్దరమూను.

బాబుకి పెళ్ళయింది. ఒక పెద్ద ఇంజనీరు గారమ్మాయి నిచ్చారు. శుభలేఖ చూసి నవ్వుకున్నాం. గ్రీటింగ్స్ పంపడానికి కూడా తీరికలేదు. పిక్చరు రిలీజ్ గొడవలో పడిపోయారంతా. తరువాత ఓసారి మద్రాసు టూరిస్టుహోం కెళ్తే తెలిసింది. అక్కడకు రహస్యంగా హనీ మూన్‌కి వచ్చారని, వాళ్ళని డిస్టర్బ్ చేయక పోవడమే ఉత్తమం. అయితే మా ఫ్రెండ్, బాబుకి చుట్టపాయన ఒకరు "పిల్ల ఎలా వుంటుంద"ని అడిగితే, "మా అత్తగారు చాలా బావుంటుంది " అన్నాడట. సిల్లీ ఫెలో (మళ్ళీ కారు కొన్నాడట...దీన్ని ఆ వచ్చినమ్మాయి నడుపుతోందిట)